రైతు భరోసా కేంద్రాల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ

విశాలాంధ్ర-పలాస : జీడి పిక్కల బస్తా 80 కేజీలకు 16వేల రూపాయలు మద్దతు ధర కల్పించి, రైత భరోసా కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్య నారాయణ, ఆలిండియా కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి.హరినాద్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక లాస్య పంక్షన్ హాల్లో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు అధ్యక్షత పలాస నియోజకవర్గం జీడి రైతుల సంఘం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ జీడికి మద్దతు ధర కల్పించకపోవడంతో జీడి రైతులు దళారీల దోపిడికీ గురవుతున్నారని, స్వామినాధన్ కమిషన్ సిఫార్సులు ప్రకారం పెట్టుబడికి 50శాతం కలిపి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కేరళ మాదిరిగా జీడి పంటకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జీడి పంట అభివృద్ధికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు అందించాలని, జీడి పిక్కలు, జీడి పళ్ళ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. జీడిపప్పు రేటు పెరుగుతున్నా పిక్కల రేటు మాత్రం తగ్గిపోవడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. అనంతరం జీడి రైతుల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కన్వీనరుగా తెప్పల అజయ్‌కుమార్, కమిటీ సభ్యులుగా డి.తాతారావు, టి.భాస్కరరావు, ఎస్.కుమార్, కె.ధనరాజు, ఆర్.పురుషోత్తం, కె.పురుషోత్తం, ఎం.రామారావు, పి.కుసుమ, కె.వినోద్, జి.బాలక్రిష్ణ, పి.ధర్మారావుతో పాటు 23 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎన్.గణపతి, బి.రామక్రిష్ణనాయుడు, ఎస్.గోపి, బి.గోపి, కె.హేమసుదన్, కె.బాలాజీ, సుధాకర్, రామకృష్ణలు పాల్గొన్నారు.

మోడీని గద్దెదించండి... దేశాన్ని కాపాడండి : వామపక్షాలు పిలుపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : దేశ వ్యాప్త ప్రచార భేరిలో భాగంగా

10 వరోజు ఆదివారం నగరంలో కెల్లవీధి, తెప్పల వీధి, పాండురంగవీధి, పుణ్యపు వీధుల్లో ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు బి.కృష్ణమూర్తి, టి.తిరుపతి రావు, డోల శంకర రావు లు మాట్లాడుతూ మతోన్మాద విధానాలతో దేశాన్ని వెనక్కు తీసుకుపోతున్న మోడీ తక్షణమే గద్దె దిగాలన్నారు. ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేని మోడీ పాలనను విమర్శించారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచి, మనుధర్మ శాస్త్రాన్ని ముందుకు తెస్తున్న తీరు దేశానికి నష్టమని పేర్కొన్నారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం విలయతాండవం చేస్తున్నా యని ఆవేదన వ్యక్తంచేశారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. ఉద్యోగు లకు, కార్మికులకు నష్టం చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వ చర్యలను తప్పుపట్టారు. ఈ కార్యక్రమం లో నాయకులు కె.భాస్కరరావు, ఏ.సోమశేఖర్, కె.సూరయ్య, ఎం.గోపి,బి.లక్ష్మీ, పి.ప్రభావతి, టి.బుజ్జిబాబు, ఎస్.శ్రీనివాసులు, ఆర్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలతో ప్రజా పోరాటం

ఎచ్చెర్లలో : రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలపై పోరాటం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యులు బి.తులసీదాసు, జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. మండలం చిలకపాలేంలో ఆదివారం నిర్వహించిన ప్రచార భేరిలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో ప్రమాదంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ గొంతెత్తాలని కోరారు. మోదీ ప్రభుత్వం ఆదాని, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతున్నట్లు ఆరోపించారు. ప్రశ్నించేవారని నిరంకుశంగా అణిచివేస్తూ.. తప్పుడు కేసులతో వేదిస్తున్నారని చెప్పారు. పేదలపై, సామాన్యులపై మెయలేని భారాన్ని మోపుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు పి.తేజేశ్వరరావు, సీహెచ్ అమ్మన్నాయుడు, తోనంగి నందోడు తదితరులు పాల్గొన్నారు.

శేఖర్ కుటుంబానికి పలువురు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని బల్లిపుట్టుగ గ్రామానికి చెందిన బచ్చల శేఖర్ ఇటీవల అకాల మరణం చెందారు. నిరుపేద అయిన శేఖర్ కుటుంబానికి జిల్లా అగ్నికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గొరకల వసంతరావు, ప్రధాన కార్యదర్శి పులక శ్రీరాములు, ఉపాధ్యక్షులు మండల ప్రధాన కార్యదర్శి కీలు చంద్రశేఖరం, పాతిన వెంకట్ రావు, ఎర్ర జగదీష్ పులకల తారాపతి, జయరాము ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబాన్ని ఓదార్చి మృతుడు శేఖర్ పిల్లలకు మేమున్నామంటూ భరోసా ఇచ్చి చిన్నారుల పై చదువులకు హాస్టల్ సదుపాయాన్ని ఏర్పాటు చేయడానికి బాధ్యత తీసుకున్నారు.అలాగే తక్షణసాయంగా 7వేలు రూపాయలను అందచేశారు.అగ్నికుల సామాజిక వర్గం వాట్సాప్ గ్రూపులో ఈ సమాచారం అందించిన వెంటనే స్పందించిన సభ్యులు 2వేలు,సీమూరు సంఘం 10వేలు రూపాయలు, బల్లిపుట్టుగ సంఘం వారు 20వేలు రూపాయలు అందించారు. ఆర్థిక సహాయం అందజేసిన వారికి జిల్లా సంక్షేమ సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కపాసుకుద్దిలో... మండలంలోని పెద్ద కపాసుకుద్ది గ్రామంలో గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన శ్రీ పురుషోత్తం లక్ష్మి కి,తమ పిల్లలు ఆవేదనను గుర్తించిన గ్రామ సర్పంచ్ కాయ దమయంతి భీమసేను దంపతులు ఆ కుటుంబానికి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం, చిన్న పిల్లలకు కొత్త బట్టలు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులకు లక్ష్మీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కర్రి బాలయ్య, పాతిన వెంకట్రావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పుస్తక దినోత్సవం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం నౌపదా శాఖ గ్రంధాలయంలో ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ శాఖ అధికారి బి రూపావతి మాట్లాడుతూ,ఈ గ్రంథాలయాల్లో ఉన్న వివిధ పుస్తకాలను చదువుకొని అందులో ఉన్న జ్ఞానాన్ని అలవర్చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా మహాభారతం, రామాయణం, భగవద్గీత, వేమన శతకం, సుమతి శతకం తో పాటు పలు పుస్తకాలను ప్రదర్శన చేశారు. ఈకార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలపై దాడి ప్రజాస్వామ్యానికే చేటు

టీడీపీ రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి నల్లి సుజాత

విశాలాంధ్ర-పాతపట్నం : టీడీపీ రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి నల్లి సుజాత పాత్రికేయులతో మాట్లాడుతూ ఎర్రగొండపాలెంలో టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు కాన్వాయ్ పై వైసీపీ గూండాలు రాళ్ల దాడి చేసి భద్రతా సిబ్బందిని గాయపరచడాన్ని తీవ్రంగా ఖండించారు. ఏపీ చరిత్రలో ఎప్పుడూ చూడని దౌర్భాగ్యకరమైన పరిస్థితులను ఈ అరాచక వైసీపీ ప్రభుత్వంలో చూడాల్సివస్తోంది అని. ప్రతిపక్ష నాయకుడి కాన్వాయ్ పై రాళ్ళు విసరడం, భద్రతా సిబ్బంది తలలు పగలగొట్టడం ఎప్పుడైనా చూశామా.ప్రభుత్వంలో భాగస్వామి అయిన కేబినెట్ మంత్రి చొక్కా విప్పేసి రోడ్లపైకి వచ్చి ఏం సందేశమిస్తున్నారు? మంత్రి చొక్కా ఇప్పడం అంటే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా చొక్క విప్పేసినట్టే. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, షర్మిల పాదయాత్రలు చేశారు. ఏనాడైనా ఇలాంటి దురదృష్టకర ఘటనలు చూశామా ఇప్పటికే చేసిన హత్యలు, దౌర్జన్యాలు, అరాచకాలు మీ సైకో మనస్తత్వ ఆకలి తీర్చలేదా? యరగొండపాళెం ఘటనపై సీఎం జగన్మోహన్ రెడ్డి సిగ్గుతో తలదించుకోవడంతో పాటు రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలనీ ఆమె డిమాండ్ చేశారు.

జిల్లాలోనే మొట్టమొదటిసారిగా జెమ్స్‌లో అవయవదానం

- మరణిస్తూ మరో ఐదుగురిని బ్రతికించాడు
- 10వ తరగతి విద్యార్థి బ్రెయిన్ డెడ్
- చివరి పరీక్ష రోజే బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్స్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : చదువుతున్నది పదో తరగతి. ఫైనల్ ఎగ్జామ్స్ కావడంతో పరీక్షకు సిద్ధమవుతున్నాడు. ఇంతలోనే తీవ్రమైన తలనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత శ్రీకాకుళంలో జెమ్స్ మెడికల్ కాలేజ్ లోని హాస్పిటల్ తరలించి చికిత్స అందిస్తున్న తరుణంలో బ్రెయిన్ డెడ్ తో మరణించి ఆ కుటుంబాన్ని తీవ్ర విశాదంలో ముంచాడు. అయినా కానీ ఆ కుటుంబ సభ్యులు శోకసంద్రంలో ఉన్నా... వారు తీసుకున్న నిర్ణయం ఇతరుల కుటుంబాల్లో వెలుగులు నింపింది. అంతేకాకుండా అవయవదానంతో సమాజానికి మార్గదర్శకంగా నిలిచింది. వివరాల్లోకి వెళ్తే... శ్రీకాకుళం జిల్లా సోంపేట గీతామందిర్ కాలనీకి చెందిన మల్లారెడ్డి మోహన్ రావు, గిరిజ కళ్యాణిల కుమారుడు కిరణ్ చంద్ (15) స్థానికంగా ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల

15న తేదీన చివరి పరీక్ష కావడంతో...చదువుతున్న సమయంలో తీవ్రమైన తలనొప్పి వచ్చింది. దీంతో తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో చూపించగా... మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తీసుకెళ్లాలని సూచించారు. దీంతో వారు విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.. అక్కడ కూడా పరిస్థితి ఏమాత్రం మెరుగు కాకపోవడంతో తిరిగి శ్రీకాకుళంలోని జెమ్స్ ఆస్పత్రికి తీసువచ్చారు. అతనిని రక్షించడానికి సీటీ సర్జన్ డాక్టర్ రవికిరణ్, సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ రోహిత్, యూరాజిస్ట్ డాక్టర్ భానుమూర్తి, డాక్టర్ పూర్ణ, అనస్థీషియా డాక్టర్ జయచంద్ర వైద్యులు ఐదు రోజుల పాటుఎంతో శ్రమించారు. కానీ దురదృష్టవశాస్తూ ఆదివారం ఉదయం బ్రెయిన్ డెడ్ అయ్యారు. ఆ తర్వాత అవయవదానంపై ఆర్గాన్ డోనేషన్ సమన్వయ కర్తలు, మృతుడి కుటుంబ సభ్యులకు బంధువులకు, అవగాహన కల్పించారు. అనంతరం మృతుడి తల్లిదండ్రుల అంగీకారంతో గుండె, కళ్లు, కిడ్నీలు, లివర్ దానం చేశారు. చనిపోతూ మరో ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపినందుకు గర్వంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఏపీ జీవన్‌ధాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రీన్ ఛానెల్ ద్వారా అవసరం ఉన్నచోటికి అవయవాలను తరలించారని జీవన్ దాన్ కమిటీ డైరెక్టర్ డా. రాంబాబు తెలిపారు. శ్రీకాకుళ జిల్లాలోనే ఇది మొట్టమెదటి అవయవదానం. ప్రతి ఒక్కరూ కూడా అవయదానం పట్ల అవగాహన పెంచుకోవాలని ఏపీ జీవన్ దాన్ ప్రకటనలో తెలిపింది.

అన్నివేళలా అండగా ఉంటా : ఎమ్మెల్సీ నర్తు

విశాలాంధ్ర-సోంపేట : నియోజకవర్గ ప్రజలకు ఏ ఆపద వచ్చినా అన్ని వేళల్లోను అండగా ఉంటానని ఎమ్మెల్సీ నర్తు రామారావు పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు తనకు కొండంత బలమని, రాజకీయాల్లో తనను ఎంతగానో ప్రోత్సహిస్తున్న ప్రజల ఆదరాభి మానాలను ఎన్నటికీ మర్చిపోలేనని అన్నారు. సోంపేట మండలం యాదవ సంఘం ఆధ్వర్యంలో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీ రామారావు ఆయన సతీమణి, మాజీ ఎంపీపీ చామంతిలను ఆదివారం కొర్లాం గ్రామంలో అయ్యప్పగుడి ఆవరణలో పెద్దసంఖ్యలో హాజరైన యాదవ సామాజిక వర్గీయులు ఘనంగా సత్క రించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ గత కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వరకు సుమారు 30ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లు, అవమానాలు గురైనప్పటికి మొక్కవోని దీక్షతో పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను తూచా తప్పకుండా అమలు చేశానని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నియోజకవర్గంలో బలోపేతం చేసేందుకు పార్టీ ఆవిర్భావం నుంచి ఎంతగానో కృషి చేస్తున్నానని చెప్పారు. తన జీవితాంతం ప్రజాసేవకే అంకితమని అన్నారు. రాజకీయాల్లో మనస్ఫూర్తిగా కష్టపడిన వ్యక్తికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని అన్నారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితుల్లో రాజకీయం ఒక్కటే ముఖ్యం కాదని, మన పిల్లల భవిష్యత్తు కోసం వారికి మంచి విద్యను అందించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. యాదవ సామాజికవర్గం మరింత ఐక్యతగా ఉంటూ బలోపేతం కావాలని సూచించారు. ఈ సందర్భంగా కొర్లాం గ్రామ పొలిమేరల నుంచి సాంస్కృతిక ప్రదర్శనలతో భారీ ఊరేగింపుగా అయ్యప్ప ఆలయం వరకు రామారావు దంపతులను తీసుకు వెళ్లి దుశ్శాలువ కప్పి సన్మానపత్రం అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నరేంద్రయాదవ్, సాలిన ఢిల్లీరావు, దాసరి రాజు, గుమ్మడి రాందాసు, కొల్లి ఈశ్వరరావు, మద్దిల నాగేశ్వరరావు, పిన్నింటి ఈశ్వరరావు, తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గిరిజన పల్లెల్లో మా నమ్మకం నువ్వే జగనన్న

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం గిరిజన గ్రామాలైనా కాంత మానుగూడా, తుమ్మికమాను గూడ, మహసింగ్ గూడ గిరిజన పల్లెల్లో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డ్ శాంతి ఆదివారం పర్యటించారు. మా నమ్మకం నువ్వే జగనన్న అనే పార్ట్ కార్యక్రమంలో పాల్గొనను న్నారు. గిరిజనులతో ఎమ్మెల్యే శాంతి మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో పిఏసీఎస్ చైర్మన్ చింతాడా సూర్యనారాయణ, జిల్లా వ్యవసాయ కమిటీ మెంబెర్ ఎల్. తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీచక్ర పెరుమాళ్ళస్వామి చందనోత్సవం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామి వారి చందనోత్సవం ఆదివారం ఆలయ అర్చకులు సత్యనారాయణస్వామి, రాజు స్వామి, రాజేష్ స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పుణ్యావచనం గావించారు. తదుపరి పంచ కలశ ఆరాధన పూర్తి చేసి చందనాన్ని తొలగించారు. నారికేళ అభిషేకం చేపట్టారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణల నడుమ స్వామివారికి చందనాన్ని పూశారు. ప్రత్యేక అలంకరణ చేపట్టి విశేష పూజలు నిర్వ హించారు. ఈకార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుండి అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని పూజలు నిర్వహించారు.

సమస్యలు తెలియజేయండి, పరిష్కరిస్తాం : ఎమ్మెల్సీ నర్తు

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని గొర్లేపాడు పంచాయతీ కాజురు గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎంఎల్‌సి నర్తు రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు.సమస్యలు తెలియజేయండి పరిష్కరిస్తామంటూ ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి మానమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను, మొబైల్ స్టిక్కర్లు అతికించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్తు చామంతి, వైసీపీ నాయకులు నర్తు నరేంద్ర, సర్పంచ్ వల్లభ రావు, వైయస్సార్సీపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం గోవిందపురం పంచాయతీ ఎరకన్నపేట గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జనసేన నాయకుడు చిన్నారావు ఆధ్వర్యంలో ప్రారం భించారు. వేసవికాలం ఎండలు తీవ్రంగా కాస్తున్నందున కోటబొమ్మాలి రైల్వేస్టేషన్ నుంచివడ్డీ వాడ వైపు ప్రయాణం చేసే ప్రయాణికు లకు ఎంతగానో ఉపయోగపడు తుందని అన్నారు. బాటసారులు చలివేంద్రాన్ని వినియో గించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-జలుమూరు : గ్రామంలో ట్రాన్స్ఫార్మర్ మెయింటెనెన్స్ మరియు కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడంలో భాగము గా సోమవారం 24న ఉదయం 08.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, ప్రజలు సహకరించాలని, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, టెక్కలి, ఎ.రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సరుబుజ్జిలిలో : సరుబుజ్జిలి మండలంలోని 33/11 కె.వి సరుబుజ్జిలి సబ్ -స్టేషన్ పరిధి లో గల 11 కె.వి. రొట్టవలస ఫీడర్ మరమ్మత్తులు, లైన్ల మీద చెట్ల కొమ్మలు తొలగించే ప్రక్రియలో భాగంగా సోమవారం నాడు ఉదయం 8.30 గంటల నుండి మధ్యాహ్నం 3.30 గంటల వరకూ పురుషోత్త పురం, రొట్టవలస, రావివలస, కొత్తకోట పరిధిలోని గ్రామాలు, ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని, ప్రజలు సహకరించాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శ్రీకాకుళం ఎస్. బయన్నాయుడు తెలియజేశారు.

కాకర్ల చెరువు పరిరక్షణకు ఆదేశాలు జారీ

విశాలాంధ్ర-జలుమూరు : మండలం చిన్నదూగాం గ్రామంలో గల కాకర్ల చెరువును పరిరక్షించాలని గరీబ్ గైడ్ స్వచ్ఛంద సంస్థ 2020లో ఎన్‌జీటీ ను ఆశ్రయించిన విషయం విధితమే.అక్కడి కాలనీవాసులను జూలై 11లోగా తరలించి, అక్రమ కట్టడాలను తొలగించాలని శనివారం కలెక్టర్‌కు ఎన్‌జీటీ ఆదేశించింది. సర్వే నెంబరు 59తో పాటు సర్వేనెంబర్ 48 లో కట్టడాలు తొలగించి చెరువు యొక్క ఇన్ లెట్స్, అవుట్ లెట్స్ తక్షణమే పునరుద్ధరించాలని కలెక్టర్ కు ఆదేశించింది.

మేడేను కార్మికవర్గ హక్కుల దీక్షాదినంగా పటిద్దాం : ఇఫ్టూ పిలుపు

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఫాసిస్ట్ ఎజెండా నిర్బంధాన్ని వ్యతిరేకించాలని, 137వ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక, కార్యదర్శులు మామిడి క్రాంతి దీర్ఘాసి గణేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ఇఫ్టూ జిల్లా విస్తృతస్థాయి సమావేశం కొత్త రోడ్ ఇఫ్టూ కార్యాలయంలో జరిగింది. 137మేడే కార్యక్రమం విజయవంతం చేయాలని కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిది గంటలు పనిదినాలు కోసం చికాగో నగరంలో కార్మికులు రక్తం చిందించి. ప్రాణత్యాగంతో మేడే జరుపుకుంటున్నామన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీం వర్కర్ల సిబ్బందిని రెగ్యు లర్ చేయాలని, అలాగే నాలుగు లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టుతుందని, ఇప్పటికే దేశంలో ఉద్యోగ భద్రత లేని కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ కార్మికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని, ఈ నేపథ్యంలో కార్మికులు సంఘాలు పెట్టుకోవడానికి, సమావేశాలు నిర్వహించు కోవడానికి మాత్రమే పరిమితం కాకుండా తమ హక్కులు సాధనకు కోసం సమరశీల పోరాటాలుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అందుకే మేడేను కార్మిక హక్కుల దినోత్సవంగా జరుపుకోవాలని కోరారు. వాడవాడలా జెండా ఆవిష్కరణలు, ఊరేగింపులు, ప్రదర్శనలు, ర్యాలీలు సభలు సమావేశాలు, నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో దమ్ము సింహచలం, దంత వెంకన్న, అన్నెపు సూర్యనారాయణ, చిత్తిరి లక్ష్మణరావు, సింగూరు బాబూరావు, నిమ్మదా రాము, కెల్లా పైడయ్యా, దువ్వ జయప్రద, సవలపురపు కృష్ణవేణి, సనపల అప్పారావు, ప్రకాష్, సత్యనారాయణ, పకీర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి వైసీపీ ప్రభుత్వ ఫలాలు : మంత్రి డా.సీదిరి

విశాలాంధ్ర-మందస: రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి వైసీపీ ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నామని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఆదివారం మండలం కొల్లపల్లి పంచాయతీలో సర్పంచ్ శానాపతి దివ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. మంత్రి డా.సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందిస్తామని అన్నారు. అనంతరం 2 లక్షల రూపాయలో నిర్మించిన బస్ షెల్టర్‌ను, 4.20లక్షల రూపాయలతో నిర్మించిన డ్రైనేజీ పనులు, 7లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సిసి రోడ్డును, 2 లక్షల రూపాయలతో నిర్మించిన మంచినీటి ట్యాంక్‌ను ప్రారంభించారు. అలాగే కోటి 16 లక్షల రూపాయలతో నాడు నేడు పనులను ప్రారంభానికి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి డొక్కరి దానయ్య, మండల పార్టీ అధ్యక్షులు అగ్గున సూర్యరావు, వైస్ ఎంపిపి ప్రసాద్, ఎంపిడివో తిరుమలరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్ వాసు కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని కపాసుకుద్ది గ్రామానికి చెందిన ఎనర్జీ అసిస్టెంట్ వాసు కుటుంబానికి జిల్లా అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం తరపున ఆర్థిక సహాయం అందజేశారు.ఈ మేరకు ఆదివారం కపాసుకుద్దిలో మృతుడు శివంగి వాసు కుటుంబ సభ్యులకు జిల్లా అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షులు గురకల వసంతరావు తోపాటు అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం సభ్యులు పరామర్శించి తమవంతుగా 5వేలు రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వాసు కుటుంబసభ్యులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కాయి భీమసేను, లీగల్ సెల్ కన్వీనర్ పులకల శ్రీరాములు,పొల్లయి అశోక్, పాతిన వెంకటరావు, చంద్రశేఖర్, పొల్లయి సతీష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా షిరిడీసాయి ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర-మెళియాపుట్టి : మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని ఆలయ ధర్మకర్త కాళ్ళ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నాడు దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని సైతం ఏర్పాటు చేశారు. ఆలయం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విద్యుత్ దీపాలతో అలంకరణ చేసి చేశారు. గ్రామస్తులతోపాటు పరిసర ప్రాంత ప్రజలు భక్తులు ఆలయాన్ని సందర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలతోపాటు అన్నప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం బాబాఉత్సవ మూర్తులను బాబానామ సంకీర్తలతో గ్రామంలో ఊరేగించారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విఫర్‌యు వార్షిక ప్రణాళిక తీర్మానం

విశాలాంధ్ర-సోంపేట : స్థానిక స్వచ్ఛందసంస్థ విఫర్‌యు 2023-24 సంవత్సరం వార్షిక ప్రణాళికపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సంస్థ అధ్యక్షుడు గార రాజేష్ అధ్యక్షతన ఆదివారం సోంపేటలో సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రతిఏటా నిర్వహించే విద్య దత్తత, ఉద్యోగార్థుల సహాయార్థం లక్ష్య కార్యక్రమం, అనాథ విద్యార్థుల కోసం హెూప్ కార్యక్రమం వంటి వాటిని గూర్చి

చర్చించారు. కొత్తగా వైద్యసేవా విభాగాన్ని ఏర్పాటు చేయుటకు నిర్ణయించారు. పలు ప్రాంతాల్లో విఫర్‌యు ఫౌండేషన్ శాఖలను కొత్తగా ప్రారంభించేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పూనా శ్రీకాంత్, వ్యవస్థాపక అధ్యక్షుడు డి.జోగారావు, ఐ.లక్ష్మినారాయణ, జి.శంకరరావు, ఎం.ఈశ్వరరావు, ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లి పాలకమండలి సభ్యులు కోటేశ్వర చౌదరీకి ఘన సన్మానం

విశాలాంధ్ర-రణస్థలం: మండల కేంద్రంలోని పిన్నింటిపేట రోడ్డులో ఉన్న శ్రీలక్ష్మి వెంకటేశ్వర అపార్ట్ మెంట్ ఆవరణలో రణస్థలం మండల సొండికుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీసూర్యనారాయణ స్వామివారి దేవస్థానం, అరసవల్లి, శ్రీకాకుళం పాలకమండలి సభ్యులుగా నియమితులయిన శ్రీ సూర్యనారాయణ స్వామివారి నిత్య సేవకులు నెమలపురి కోటేశ్వర చౌదరికి ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత కోటేశ్వర చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం సొండి కులాన్ని గుర్తించి ఈపదవి ఇవ్వడం సొండి కులానికి మంచి గుర్తింపు వచ్చిందన్నారు. సొండి కులం ఆర్థికంగా వెనుకబడి ఉందని గుర్తించి ఒసి నుంచి బిసి'డి'లో చేర్పించిందని అలాగే ప్రభుత్వ పెద్దలు గుర్తించి ఒబిసిలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సొండి కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మొగలపురి కిషోర్ కుమార్, ఎం.ఎం.రావు, పరిదాల మౌళిశ్వరరావు, సుధాకర్, ప్రకాష్, బాలరాజు, రమణబాబు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దళితులను బలిపశువు చేయడానికే వైసీపీ కుతంత్రాలు : కూన

విశాలాంధ్ర-పొందూరు: దళితులను బలిపశువు చేయడానికి వైసీపీ ప్రభుత్వం కుతంత్రాలు కుట్రలు పన్నుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నా రు. మండలం కింతల్లి పంచాయతీ ఖాజీపేటలో సర్పంచ్ పైడి ప్రసాద్, ఎంపీటీసీకె హనుమంతురావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఇదేమి ఖర్మ- మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్నారు. దళిత బిడ్డలను ముందు పెట్టి వెనుక నుంచి రౌడీలతో దాడులు చేయిస్తోందని ఈ కుట్రలకు దళిత బిడ్డలు బలైపోతున్నారని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు, చంద్రబాబునాయుడు పర్యటనలో నిరసనల పేరుతో చంద్రబాబుపై రాళ్ళతో దాడులు చేయించారని దాడిలో ఎస్‌ఎస్టి సిబ్బంది గాయపడ్డారని చంద్రబాబు వారించక పోతే రక్షణ కోసం ఎస్‌ఎస్టి కాల్పులు చేస్తే ఎవరు బలైపోయేవారని ప్రశ్నించారు. దళిత బిడ్డలు వైసీపీ కుట్రలను గుర్తించాలని వెనుకనుంచి రౌడీలతో దొంగదాడులను చేయించే సూత్రధారులకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. జగన్మోహనరెడ్డికి ఎవ్వరి పైనా ప్రేమ లేదని రాజీకీయప్రయోజనం కోసం దళితులను పావులుగా వాడుకుం టున్నారని దీనికి గ్రహించాలని కోరారు. వైసీపీ లోకేష్ వ్యాఖ్యలు పై తప్పుడు ప్రచారం చేస్తోందని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసారని వైసీపీ విచారణ జరిపి నిజా నిజాలు తేల్చాలని డిమాండ్ చేస్తారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహన్, ప్రధానకార్యదర్శి వందాన మురళీ, మండల ఉపాధ్యక్షులు నెంబర్ 4 ఎంపీటీసీ ప్రతినిధి బాడన శేషగిరి నాయుడు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు సీనియర్ తెలుగుదేశం పార్టీ నేత కూన సత్యనారాయణ, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర్, ఏఎంసీ మాజీ చైర్మన్ అన్నెపు రాము, సీపాన శ్రీరంగనాయకులు, సీతారామారావు, డి. సన్యాసిరావు, కె. శ్రీనివాసరావు. జగన్మోహనరావు సత్యం మదులతో పాటు వందలాదిమంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

- జగన్‌ను కోరిన ఎంపీటీసీ రాజశేఖర్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : కోటబొమ్మాళి మండలంలో ఎక్కువగా మెట్టుప్రాంతం ఉండటం వల్ల ప్రతీ సంవత్సరం వేసవిలో తాగునీటికోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాటిపై తమరు ప్రత్యేక దృష్టి సారించి శ్వాతిత పరిష్కారం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎలాంటి అభివృద్ధి పనులకు నోచుకోక, తర్లిపేట, జీయన్నపేట, చిన్నసాన పంచాయతీలలో చాలా వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాటికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి అందజేసిన వినతిపత్రంలో కోరారు. అలాగే ఇటీవల టెక్కలిలో పర్యటించిన రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌కు కిల్లి కృపారాణి ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిశారు. కోటబొమ్మాళి మండలంలో ప్రభుత్వ పాఠశాలలో నాడునేడు పనులు జరుగుతున్నాయని వాటిని సకాలంలో బిల్లులు చెల్లించాలని కోరారు. అలాగే చాలా ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాటిని నిధులు మంజూరు చేయాలన్నారు.

టీడీపీ కుటుంబసభ్యులంతా కలిసికట్టుగా ముందుకెళ్ళాలి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : వైకాపా అవలంభించే ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల మధ్య ఎండగట్టేందుకు టీడీపీ కుటుంబసభ్యులంతా కలిసికట్టుగా పోరాడాలని, తెదేపా నాయకులపై కక్ష పూరితంగా చేసే విధాలను అడ్డుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి శాసన సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం అచ్చెన్నాయుడు నిమ్మాడ గ్రామంలో తన క్యాంపు కార్యాయలంలో ఉన్నారన్న విషయం తెలుసుకన్న కార్యకర్తలు, నాయకులు జిల్లా నలుమూలలు నుంచి పెద్ద ఎత్తున ఆయన కలుసుకొని తమ సమస్యలు తెలియజేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు వారికి పలు సూచనలు, సలహాలు చేశారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన చేస్తుందని దీంతో ప్రతి ఒక్కరు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలతో పాటు ప్రతీ కార్యకర్తకు, నాయకులకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అయితే మరో యేడాది ఓపిక పడితే మళ్ళీ టీడీపీ అధికారంలోకి వస్తుందని అప్పటి వరకు ఈ సమస్యలు ధైర్యంగా ఎదుర్కోవాలని కార్యకర్తలను పిలుపు నించారు. కోటబొమ్మాళి మండలం అక్కయ్యవలస, చిన్నబమ్మిడి, కొత్తపల్లి, చిన్నసాన, నందిగాం మండలం బెజ్జిపల్లి, కణితూరు, బడగాం, సంతబొమ్మాళి మండలం నౌపడ, పాలతలగాం, గోవిందపురం, నర్సాపురం, నరసన్నపేట, పోలాకి మండలం రాజపురం, టెక్కలి మండలం లింగాలవలస గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నాయకులు అచ్చెన్నాయుడును కలిసి తమ సమస్యలు తెలియజేశారు.

కాలువలు శుభ్రం చేసిన యువశక్తి

విశాలాంధ్ర-ఆమదాలవలస: పాత ఆమదాలవలస 19, వార్డ్ కాలువలు చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన రావడంతో ప్రజల ఇబ్బందులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు గమనించిన యువజన సంఘ సభ్యులు కాలవలను శుభ్రం చేశారు. మున్సిపాలిటీలో నిరాదరణకు గురైన వార్డు కావడంతో స్థానిక ఎస్సీ కాలనీ యువత కాలువల శుభ్రం చేయడంతో పాటు పాడైన కాలువలు కూడా మరమ్మతు చేశారు. యువశక్తి యువజన సంఘం యువకులు కాలువలు శుభ్రం చేసారు జై భీమ్ అంటూ యువకులు ఉత్సాహంగా పారిశుధ్య పరిరక్షణలో పాల్గొన్నారు. స్థానికులు యువకుల సేవను అభినందించారు.

భూ కబ్జాలకు పలాస అడ్డాగా మారింది

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

విశాలాంధ్ర-పలాస : వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం అటు రాష్ట్రంలో ఇటు పలాస నియోజకవర్గంలో విపరీతంగా భూకబ్జాలు జరుగుతున్నాయని, భూకబ్జాలకు అడ్డాగా పలాస మారిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సూది కొండ గ్రామంలో ఆదివారం సాయంత్రం టిడిపి ఆధ్వర్యంలో రాష్ట్రానికి ఇదేమి ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కాలనీ వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో ప్రభుత్వ ఆస్తులు, నియోజవర్గ ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని, అందుకు మంత్రి సీదిరి అప్పలరాజు వాటిని నియంత్రణ చేయాల్సి పోయి భూ కబ్జాలను ప్రోత్సాహిస్తున్నా రని ఆరోపించారు. ప్రవేటు స్థలాలను సైతం ఆక్రమించేందుకు వైసిపి నాయకులు ప్రయత్నం చేస్తున్నారని, అందుకు పత్రికల్లో వచ్చిన కథనాలే సాక్షమన్నారు. సూది కొండలో వైసిపి నాయకులు యదేచ్ఛగా ఆక్రమణలుచేస్తున్న రెవిన్యూ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అక్రమాలు జరుగుతున్నాయని అధికారులు దృష్టి తీసుకెళ్లిన ఫలితం లేకపోతుందన్నారు. అవనీతి పై ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేసారు. టిడిపి ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, పార్టీ కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తను కాపాడుకుంటామన్నారు. ప్రభుత్వం ఇష్టాను సారంగా నిత్యవసర వస్తువులు పెట్రోల్ డీజిల్ విద్యుత్ చార్జీలను పెంచుకు పోతుందని, వాటిని నియంత్రించేవరకు ప్రజల తరఫున నిరంతరం టిడిపి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, గురిటి సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి నవీన్, గాలి కృష్ణారావు, సైన వల్లభ, చిన్ని, పైల చక్రధర్, సత్యం, రామకృష్ణ, రమేష్, నరసింహ, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర-పలాస: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, మంచి ఆహార అలవాట్లు చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని మాజీ కౌన్సిలర్ కొవ్వూరు సురేష్ కుమార్ రోగులకు సూచించారు. పలాస ఉదయపురం గ్రామంలో రజక సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం జేమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేద రోగులకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. వైద్య శిబిరానికి సుమారు 300 మంది రోగులు హాజరు కాగా బిపి, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేమ్స్ ఆసుపత్రి వైద్యులు విజయ్ కుమార్, రాకేష్, బాలాజీ, జేమ్స్ మేనేజర్ చిన్నారావ్, ప్రదీప్, తిరుపతి, కిషోర్, కొవ్వూరు బైరాగి, కొవ్వూరు గోపాల్, రట్టి మనోజ్ కుమార్, రాజాం కూర్మరావు తదితరులు పాల్గొన్నారు.

డా. అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని శవసాన పుట్టుగ గ్రామంలో ఆదివారం డాక్టర్ అబ్దుల్ కలామ్ పౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో సోంపేటకు చెందిన డాక్టర్ శీలా కంటి ఆసుపత్రి వైద్యులచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ ఉచిత కంటి పరీక్షలకు చుట్టుపక్కల గ్రామాల నుండి సుమారు 150 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణి చేశారు. అనంతరం గ్రామంలో ఉన్న గ్రామస్తులు, యువత, డాక్టర్ అబ్దుల్ కలాం సంస్థ సభ్యులు డాక్టర్ శీలా దంపతులను పుష్పగుచ్ఛాలు అందజేసి దుస్సాలువతో సత్కరించారు. డాక్టర్ అబ్దుల్ కలాం సంస్థకు కోట దాలయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు 3 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శీలా కంటి వైద్య సిబ్బంది, డాక్టర్ అబ్దుల్ కలాం సంస్థ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కణితి విశ్వనాధంకు స్మృత్యాంజలి

విశాలాంధ్ర-పలాస: ఆదివారం లయన్స్ క్లబ్ అఫ్ పలాస -కాశీబుగ్గ సభ్యులు ఆధ్వర్యంలో ఈనెల 15న మృతిచెందిన డా. కణితి విశ్వనాధం కి లయన్స్ హాల్ లో స్మృత్యంజలి ఘటించారు. ముందుగా క్లబ్ ప్రెసిడెంట్, సెక్రటరీలు కుటుంబ సభ్యులు తో కలసి స్వర్గీయ డా. విశ్వనాధం చిత్రపటానికి పూలమాలలు వేశారు. క్లబ్ సభ్యులు పూలతోనూ, కొవ్వొత్తుల కాంతుల తో ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గతలో లయన్స్ క్లబ్ ట్రస్టీ గా ఉన్న, కీ.శే.విశ్వనాధం స్థానంలో వారి కుమార్తె లయన్.శారద రాజేష్ ను ట్రస్టీ గా ఏకగ్రీవంగా క్లబ్ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంలో డా.రాజేష్ దేవరకొండ, ఉషా హేమాచలం కణితి, దువ్వాడ ఉమా మహేశ్వర రావు, (టీచర్)లను కొత్తగా లయన్ మెంబెర్స్ గా చేర్చుకోవడం జరిగిందని సభ్యులు తెలిపారు. ఈ సమావేశంకు క్లబ్ ప్రెసిడెంట్ నెమలిపురి అప్పారావు, సెక్రటరీ తమ్మినాన మాధవరావు, కోశాదికారి వీరఘట్టం వెంకటరావు, కణితి హేమాచాలం, వజ్జ బాబురావు, డా. ఆర్ ఆనందరావు, పైల సూర్యనారాయణ, వి.జవహర్, యెందు దొర, హేమాచలం, డోకి రామారావు, మిగతా లయన్ మెంబెర్స్ హాజరయ్యారు.

సమాజ సేవలో మాతృమూర్తి యువజన సంఘం

- ఉరిమే ఉత్సాహం వారి సొంతం
- ఆపదలో ఆదుకోవడం వారి నైజం

విశాలాంధ్ర-కవిటి : ఓవైపు ముదురుతున్న వ్యాధులు, మరోవైపు పగబడుతున్న ప్రకృతి విపత్తులు. వీటిమధ్య సతమతమవుతున్న ఉద్దానం బడుగుబలహీన వర్గాలకు ఏదో చేయాలనే ఆలోచనలోంచి పుట్టుకొచ్చిందీ 'మాతృమూర్తి' అంటున్నారు ఈ యువజన సంఘం సభ్యులు. వివేకానందుని స్ఫూర్తితో, దీనజనోద్ధారణ లక్ష్యంతో 2010వ సంవత్సరంలో పదిమంది యువకులతో ప్రారంభమై.. నేడు వందమంది సభ్యులతో సాయం కోసం ఆర్తిగా ఎదురుచూస్తున్న వారికి అండగా ఉంటున్నామని ఆనందంగా చెబుతున్నారా యువకులు. కేవలం కవిటి మండలంలోనే కాకుండా ఆపద అన్నవారికి అండగా ఉంటూ జిల్లా వ్యాప్తంగా తమ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ఉరిమే ఉత్సాహంతో ధీనజనులకు సేవలందించడమే తమ లక్ష్యమని ఆపన్నులకు అభయం అందించటమే తమ నైజం అని సగర్వంగా చెబుతున్నారీ మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు.

నెలవారీ చందాలు వేసుకుని... తమ సేవా కార్యక్రమాల కోసం ఎవరిపైనా ఆధారపడకుండా ఉండేందుకు ముందుగా ఈ పదిమంది నెలవారీ చందాలు వేసుకుని సంఘం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వీరి సేవాతత్పరత చూసి వీరికి చేయందించేవారు తొడయ్యారు. తరువాత ఇంతింతై వటుడింతై అన్నట్టు మాతృమూర్తి యువజన సంఘం సేవలు నలుమూలల వ్యాపించి నలుగురికీ అండగా నిలుస్తున్నాయి.

ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ... కేవలం అండగా ఉండటమే కాకుండా ప్రజల్లో ఉన్న అపోహలు తొలగిస్తూ, సామాజిక కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలపై వారిలో చైతన్యం కలిగిస్తున్నారు మాతృమూర్తి సభ్యులు. ముఖ్యంగా మరుగుదొడ్లు, స్వచ్ఛభారత్, ఓటు హక్కు ఆవశ్యకత వంటి అంశాలపై గ్రామాల్లో సదస్సులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నారు.

కిడ్నీ వ్యాధి నుంచి... ఉద్దానం ప్రాంతంలో బడుగుబలహీన వర్గాల్లో కిడ్నీ వ్యాధికి గురై అనేకమంది ఆపన్నాహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. అటువంటి వారికి ఓ 'మాతృమూర్తి'లా ఆదరిస్తున్నారు. ఈ యువజన సంఘం సభ్యులు. అంతేకాకుండా నిరుపేదలు, అభాగ్యులకు అన్నపూర్ణ అమృతహస్తం పేరిట నిత్యావసర సరుకులు అందజేస్తూ తనకు చేతనైన సాయం చేస్తోంది మాతృమూర్తి యువజన సంఘం. అత్యవసర పరిస్థితుల్లో మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు చేసిన రక్తదానం కొన్ని వందల జీవితాల్లో వెలుగులు నింపింది. దీంతో ఆపద.. అంటే సరే పదా అంటూ మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు అందిస్తున్న ఆపన్నాహస్తం వెన్నోల్లా కొనియడబడుతోంది. ఇంతేకాకుండా పేద విద్యార్థులకు

పుస్తకాలు, దుస్తులు అందిస్తూ గ్రామంలో రూ.75 వేలతో వినాయక విగ్రహం, రూ.20వేలతో సరస్వతి దేవి విగ్రహం నిర్మించారు. మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు.

మధ్యతరగతికి చెందిన వారే దాతలు... ఇన్ని కార్యక్రమాలు అమలుచేస్తున్న మాతృమూర్తి యువజన సంఘం సభ్యులందరూ దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారవడం విశేషం. మంచిమనసుతో చేసిన పని ఏదైనా మంచి ఫలితాన్నే ఇస్తుందనే బలమైన నమ్మకంతో ముందుకు సాగుతున్న మాతృమూర్తి యువజన సంఘం ప్రతీ ఉగాదికి స్థానిక కళాకారులను ఘనంగా సన్మానిస్తూ వారికి అండగా ఉంటోంది. ఈ విధంగా ఆపద అన్నవారికి అక్కున చేర్చుకుంటూ... ఆర్తిగా ఎదురుచూస్తున్న వారికి అమ్మలా ఆదరిస్తూ వెన్నోల్లా కొనియాడబడుతోంది 'మాతృమూర్తి యువజన సంఘం'.

నలుగురికి సాయం అందించడంలో తృప్తి దాగి ఉంది : సమాజ సేవ చేసి నలుగురికి మంచి చేయాలని ఉద్దేశంతో గ్రామం తో పాటు మరికొన్ని గ్రామాలలో సేవా కార్యక్రమాలు మా సంఘ సభ్యులు సహకారంతో దిగ్విజయంగా పూర్తి చేయగలుగుతున్నాం. నలుగురికి సహాయం అందించడంలో ఉన్న తృప్తి మరువలేనిది. యువజన సంఘాలకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందజేస్తే మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు వీలుంటుంది. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

గ్రామం అభివృద్ధి యువతతోనే సాధ్యం: ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూడకుండా యువకులంతా ఏకమై, గ్రామాభివృద్ధికి, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే యువకులతోనే సాధ్యం. యువకుల సౌరధ్యంలో మాతృమూర్తి యువజన సంఘం స్థాపించి, ప్రజా ప్రయోజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సంఘ సభ్యులంతా చందాలు వేసుకుంటూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. సంఘ సభ్యులందరూ పేద, మధ్యతరగతికి చెందిన వారే.

ఆద్యంతం భక్తి పారవశ్యం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : అత్యంత భారీ అంచనాలతో వైభవంగా సంబరాలు నిర్వహించే ప్రయత్నాలు చేస్తున్న శ్రీ స్వేచ్ఛావతి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్ర శని వారాల్లో అమ్మవారి ఊరేగింపును ఘనంగా బెల్లుపదా వీధుల్లో నిర్వహించగా, ఆదివారం ఉప్పాడ వీధి, నీలకంఠేశ్వర వీధి, పూరేటి వీధి, హరిజన వీధి తదితర వీధుల్లో ఘనంగా ఊరేగింపు కొనసాగించారు. అమ్మవారి ఊరేగింపు రోజుకో ప్రాంతంలో సాగుతుండటంతో ఆయా ప్రాంతాల్లోని వ్యక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోతున్నారు. వీధులను పలు రకాల ముగ్గులతో అలంకరించి అమ్మవారితో పాటు అనుచర గణాలను సాదరంగా ఆహ్వానిస్తున్నారు. అమ్మవారి గ్రామ ప్రవేశం తర్వాత ఐదవ రోజు చాలా ప్రధానమైనదిగా విశ్వశిస్తారు. అమ్మవారు బెల్లుపదాలో సందెరాయ మండపం వద్దకు వెళ్ళే సందర్భంలోని ఘట్టాన్ని ఓ అనవాయితీగా, ప్రశస్తమైనదిగా భావిస్తారు. అదే అంచనాలతో శుక్రవారం పెద్ద సంఖ్యలో బెల్లుపదాలో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని చూసేందుకు హాజరైయ్యారు. సందెరాయి మండపం వద్దకు వచ్చే ప్రాంతం ఇరుకుగా ఉండటం ముందస్తు ఏర్పాట్ల లోపంతో ఓ అద్భుతమైన ఘట్టం నీరుగారిపోయిందని భక్తులు నిరుత్సాహపడ్డారు. బెల్లుపదాలో సందెరాయి వద్ద గుమిగూడిన యువకుల కేరింతల్లో అమ్మవారు సందెరాయికి చేరుకోవడం అక్కడి అనవాయితీ ప్రకారం జరగాల్సిన ఘట్టం కనుమరుగైపోయింది. అక్కడికి ముందుగా కాళిక వచ్చి ప్రదర్శన అనంతరం ఆద్యంతం అమ్మవారి రాక కోసం మహిళలు, వృద్ధులు కిక్కిరిసి ఎదురు చూసినా తగిన కనువిందు కలగలేదని పలువురు భక్తులు వాపోయారు. అమ్మవారు సందెరాయి దగ్గరకు ఇలా వచ్చి అలా వెళ్ళిపోవడాన్ని మొదటిసారి చూస్తున్నామని అక్కడి ప్రజలు వృద్ధులు చర్చించుకున్నారు. ఆదివారం నాటికి చాలా ప్రాంతాల్లో కళా కుంజాలు ప్రదర్శనాత్మక విగ్రహాల ఏర్పాటు ఊపందుకుంది. చంద్రా నగర్‌లో ఆదివారం ఆవిష్కరించబడిన బెజవాడ కనకదుర్గ ప్రతిమ ఆద్యంతం చూపరులను ఆకర్షించి భక్తి భావాన్ని వెదజల్లుతుంది. అమ్మవారే స్వయంగా అక్కడ కూర్చుని భక్తులను ఆశీర్వదించేలా భావించి పెద్ద ఎత్తున పూజలు చేస్తున్నారు. అమ్మవారి అలంకరణకు పుస్తెలు తాళిబొట్టు పిఠాపురం నుంచి, ప్రత్యేకంగా చీరను విజయనగరం నుంచి తెప్పించి అలంకరించారు. డబ్బూరి వీధిలో కలకత్తా కాళి రామక్రిష్ణ పరమహంస శారదా దేవీలతో కూడిన విగ్రహాన్ని, నర్మదేశ్వరాలయం వద్ద కుమారస్వామి, గిలాయి వీధిలో పంచముఖ ఆంజనేయస్వామి, పొందర వీధి వద్ద జ్వాలాముఖి, స్వేచ్ఛానగర్ వద్ద ఆదిపురుష్ తదితర విగ్రహాలను ఏర్పాటు చేసారు.

గొటివాడలో వడదెబ్బపై అవగాహన

విశాలాంధ్ర-జలుమూరు : రోజురోజుకీ పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా ఉపాధి హామీ వేతనదారులు జాగ్రత్తగా ఉండాలని గొటివాడ సచివాలయ ఏఎన్ఎం జ్యోతి సూచించారు. జలుమూరు మండలం గొటివాడలో పనిచేస్తున్న ఉపాధి హామీ వేతన దారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఓఆర్ఎస్‌తో వణం, నీరు, కొబ్బరి నీరు వంటి ద్రావణాలు అధికంగా తీసుకోవడం వలన వడదెబ్బకు గురికాకుండా రక్షణ పొందవచ్చన్నారు. ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర-ఎచ్చెర్ల:జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలల్లో ఐదోతరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 8 కేంద్రాల్లో ఐదో తరగతి ప్రవేశానికి ఉదయం జరిగిన పీరక్షకు 2,238 మందికి 1,751 మంది హాజరై 78.23 శాతం నమోదైంది. జిల్లాలో 9కేంద్రాల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 1,604 మందికి 1,236 మంది హాజరై 77.05 శాతం నమోదైంది. ఓఎంఆర్ షీటు విధానంలో ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఈ ప్రవేశ పరీక్ష జరిగింది. ఈ ప్రవేశపరీక్షను గురుకుల విద్యాలయాల సంస్థ అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్, రాష్ట్ర పరిశీలకుడు ఎన్.సంజీవరావు, జిల్లా సమన్వయకర్త జి.గ్రేస్ పర్యవేక్షించారు. ప్రవేశపరీక్ష ఫలితాలు 15 రోజుల్లో విడుదలవుతాయని జిల్లా సమన్వయకర్త గ్రేస్ తెలిపారు.

కణితి కుటుంబాన్ని ఎంపీ పరామర్శ

విశాలాంధ్ర-పలాస : పలాసలో నివాసం ఉంటున్న మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం ఇటీవల మృతి చెందడంతో కణితి కుటుంబాన్ని జిల్లా ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదివారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఇటువంటి నాయకులు ఎవరు లేరని, పార్టీలకు అతీతంగా అందరినీ గౌరవించే వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఎంపీగా ఉన్న సమయంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. ముందుగా కణితి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్ రావు లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ గాలి కృష్ణారావు నాగరాజు నవీన్ దాస్ నాయుడు టిడిపి నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రతీ ఒక్కరూ ఏదో ఒక రూపంలో సేవ చెయ్యాలి

మానవ సేవే మాధవ సేవ... వన్ టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : స్థానిక పెద్దబారాటం వీధి డిఎస్పీ కార్యాలయ దరిలో ఉన్న శ్రీ సీతారాముల ఆలయ ప్రాంగణం నందు మండుటెండలను దృష్టిలో పెట్టుకొని ఆలయ కమిటీ మజ్జిక చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ మహోత్తరమైన కార్యక్రమాన్ని శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ.బలివాడ గణేష్ ప్రారంభించి మాట్లాడుతూ మండుటెండలను దృష్టిలో ఉంచుకొని పాదచారుల దాహార్తిని తీర్చటానికి ముందుకు వచ్చిన ఆలయ కమిటీని అభినందించి దాహార్తులకు ఆయనతో పాటు సామాజిక కార్యకర్త చిన్నారి ట్వింకిల్ చేతుల మీదుగా సుమారు 3000 మందికి మజ్జిక పంపిణీ చేశారు. వేసవి వేడి గాలులకు వడదెబ్బలు తగిలే అవకాశం ఉన్నందున అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్య కూడళ్లతో పాటు రద్దీగా ఉండే ప్రదేశాలలో సేవ చేయాలనుకునే దాతలకు చలివేంద్రం ఒక చక్కటి అవకాశమని, ప్రతీ ఒక్కరూ ఏదో ఒక రూపంలో సేవ చెయ్యాలని, మానవ సేవే మాధవ సేవని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తో పాటు, పోలీస్ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు, సామాజిక కార్యకర్త చిన్నారి ట్వింకిల్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు తరాలకు భూ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-పొందూరు : భూమి యొక్క సంపద పెంపొందించి భవిష్యత్తు తరాలకు అవగాహన పెంపొందించుకోవాలని ప్రభావతి జాగృతి ట్రస్ట్ వ్యవస్థాపకుడు మరియు రోటరీ క్లబ్, శ్రీకాకుళం పబ్లిక్ ఇమేజ్ చైర్మన్ ఎస్. వసంతరావు అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల,పొందూరు ఆవరణలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమం లో మాట్లాడుతూ, భవిష్యత్తు తరాలకు భూమి ఆవశ్యకత, భూమి సంరక్షణ, ప్లాస్టిక్ వాడకం నిరోధించడం, నీటి నిల్వలు పెంచడం, రసాయనాలు, ఎరువుల వాడకం తగ్గించడం, మొక్కలు నాటడం, పర్యావరణం పరిరక్షణ వంటి అంశాలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన ఉపాధ్యాయులు వి. వి.రామరాజు మాట్లాడుతూ విద్యార్థులు తమ పుట్టిన రోజు తప్పకుండా ఒక మొక్క తమ ఇంటి పరిసరాలలో నాటడం అలవర్చు కావాలని కోరారు. మొక్కలు పెంచడం ద్వారా భూతాపాన్ని తగ్గించ వచ్చని తెలిపారు. అనంతరం ప్రభావతి జాగృతి ట్రస్ట్,పొందూరు మరియు రోటరీ క్లబ్,శ్రీకాకుళం సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మామిడి, జామ, నేరేడు, సపోట మొక్కలు ప్రధాన ఉపాధ్యాయులు వారి చేతుల మీదుగా నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి. పద్మావతి, వ్యాయామ ఉపాధ్యాయులు డి.ఉదయకుమార్, బి.గణపతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గంగా పుష్కరాల యాత్రకు బస్సులు సిద్ధం

విశాలాంధ్ర-పలాస : గంగా పుష్కరాల యాత్రకు ఆర్టీసీ బస్సులు వేయడం జరిగిందని పలాస ఆర్టీసీ డిపో మేనేజర్ వేదుల శ్రీనివాసు తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గంగా పుష్కరాలకు వెళ్ళేందుకు సిద్ధంగా ఆర్టీసీ బస్సుకు ఆదివారం ఉదయం హారతి ఇచ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి మే 3 వరకు జరిగే గంగా పుష్కరాలకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రయాణికులు, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బస్సు యాత్ర నాలుగు రోజుల పాటు జరుగుతుందన్నారు. ఇదిలా ఉండగా పలాసకు చెందిన మల్ల సూర్యనారాయణ గుప్త 25మంది భక్తులకు సొంత నిధులతో గంగా పుష్కరాలకు పంపించడం అభినందనీయమన్నారు.

జిల్లా పశుసంవర్ధక సహాయకుల ప్రెసిడెంట్‌గా ముకుందరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : శ్రీకాకుళం జిల్లా పశు సంవర్ధకశాఖ సహాయకుల అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కూటికుప్పల ముకుందరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం శ్రీకాకుళం పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయంలో ప్యార వెటర్నరి చైర్మన్ తిరుమలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు సచివాలయానికి చెందిన పశుసంవర్ధకశాఖ సహాయకులు కూటికుప్పల ముకుందరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముకుందరావు ఎన్నికపట్ల చీపుర్లపాడు సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి, ఎంపీటీసీ బొడ్డు అప్పన్న, లఖందిడ్డి సర్పంచ్ బమ్మిడి గణపతిస్వాములు అభినందనలు తెలియజేశారు.

త్రినాద్‌స్వామిని దర్శించుకున్న భక్తులు

విశాలాంధ్ర-హిరమండలం : మండలం లోని అంబావిల్లి త్రినాధస్వామిని వైశాఖ మాసం మొదటి ఆదివారం కావడంతో అదివారం వేకువజాము నుంచి శ్రీశ్రీశ్రీ త్రినాధస్వామి ఆలయం వద్దకు భక్తులు ముమ్మరంగా పోటెత్తారు, ఈమాసంలో ప్రసిద్ధి గాంచినటువంటి త్రిమూర్తుల ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చిప్రతీ యేటా స్వామివారికి ముడుపులు మొక్కుబడులు తీర్చుకొని స్వామి వారిని దర్శించుకుంటారని ఆలయ ప్రధాన అర్చకులు రాధాకృష్ణ పాండా, బాలక్రిష్ణ పండాలు పేర్కొన్నారు.

శ్రీదేవి ఖడ్గమాల నామాల కుంకుమార్చనలో పాల్గొన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పాతపట్నం : నియోజకవర్గ శాసన సభ్యురాలు రెడ్డి శాంతి ఈరోజు ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ నీలమణిదుర్గ అమ్మవారి 48వ వార్షిక నవరాత్రి యాత్ర మహోత్సవ కార్యక్రమం లో భాగంగా రెండవ రోజు శ్రీదేవి ఖడ్గమాలా నామాలతో కుంకుమార్చన, మండప ఆవరణ దేవతా హవన కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతు నియోజక వర్గంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని సకాలంలో వర్షాలు కురిసి రైతులు పుష్కలంగా పంటలు పండించు కోవాలని కరువు కాటకాలు రాకుండా అమ్మవారి కరుణా ప్రజలపై అలాగే రాష్ట్ర ప్రభుత్వం పై ఉండాలని మనసారా కోరుకుంటున్నానని అన్నారు.

అచ్చంనాయుడును కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం మరువాడ, మేఘవరం, మూలపేట తో పాటు పలు పంచాయతీలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చం నాయుడు ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే గోవిందపురం, కోటపాడు, తోటాడ, సంతబొమ్మాళి పంచాయతీలు చెందిన తెలుగుదేశం నాయకులు కలిశారు.

అరిణాం అక్కివలసలో నేత్ర పరీక్షలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్య ంలో మండలం అరిణాం అక్కివలస గ్రామంలో రెండు రోజులుగా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం శంకర్ పౌండేషన్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం శంకర్ పౌండేషన్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో 100 మందికి నేత్ర పరీక్షలు జరిపి మందులను అందజేశారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ డి.తాతారావు, శంకర్ పౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎచ్చెర్లలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-7 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆదివారం మహిళలకు రక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో పీవో టి.భవాని తదితరులు పాల్గొన్నారు.